నిరుద్యోగ భృతి ఏది బాబూ?



గతంలో ఇదే వాగ్దానం ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు ఈ హామీ అమలు చేయకుండా నిరుద్యోగులను మోసం చేశారు. ఇప్పుడు మళ్లీ మరోసారి అదే హామీ ఇచ్చి మోసం చేస్తారేమో అనిపిస్తుంది. ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి మాటే ఎత్తడం లేదు. నిరుద్యోగ భృతి ఇస్తే ఆ సొమ్ములతో మంచి కోచింగ్ తీసుకుని కాంపిటేటివ్ పరీక్షలకు ప్రిపేర్ అవ్వుదామనుకుంటున్నా.

– వి శ్రీనివాస్, రాజుల్లంక

రూ.20 వేల సాయం ఎప్పుడిస్తారో?



గత ప్రభుత్వంలో రైతు భరోసా పేరుతో పంట ప్రారంభంలోనే రూ.7,500, అక్టోబర్‌లో రూ.4000 లెక్కన కచ్చితంగా ఏడాదికి రూ.13,500 అందేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.20 వేలు ఇస్తామన్నారు. మీ మాట నమ్మి ఓట్లేశాం. ఇప్పుడు సాగు పనులు ప్రారంభమై నెలలు గడుస్తున్నా రైతు భరోసా ఊసే ఎత్తడం లేదు. ఆరుగాలం కష్టపడే రైతులని మోసం చేయడం తగదు.


– మన్నే ముత్యాలరావు, మొగల్తూరు.

ఆడబిడ్డ నిధి అందించాలి



మహిళలందరికీ ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500 చొప్పున అందజేస్తామని చెప్పి ఓట్లేయించుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినాటి నుంచి ఈ పథకం ఎప్పుడు అమలు చేస్తారా అని మేమంతా ఎదురుచూస్తున్నాం. మాలాంటి పేదలకు ఆ డబ్బు ఎంతో ఆసరాగా నిలుస్తుంది. ఇప్పటికైనా వెంటనే పథకాన్ని ప్రారంభించి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి లెక్కగట్టి అందించాలి.

– అరవ భవాని, వైఎస్‌పాలెం



సూపర్ సిక్స్.. మోసం ఫిక్స్

అధికారం కోసం ఆరు అందమైన అబద్ధాలుగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఆదిలోనే అటకెక్కించారు. సంపద సృష్టించి సంక్షేమం అందిస్తామంటూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీలు నీటి మూటలేనని అర్థం అవుతుందని ప్రజలు మండిపడుతున్నారు. తల్లికి వందనం, రైతుల ఖాతాలకు జమ చేయాల్సిన అన్నదాత సుఖీభవ ఇప్పటికీ ఇవ్వలేదు. ఏడాదికి కుటుంబానికి మూడు ఉచిత సిలిండర్లు, ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్ల నుంచి 60 ఏళ్ల వయస్సు ఉన్న మహిళలకు రూ.1500, నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి హామీల అమలు గురించి ప్రభుత్వ పెద్దలు అస్సలు మాట్లాడడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం కచ్చితంగా ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

–నరసాపురం, పాలకొల్లు, ఆచంట

సూపర్ సిక్స్

- యువతకు 20 లక్షల ఉద్యోగాలు / నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి
- స్కూలుకి వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15,000
- ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం
- ప్రతి మహిళకి నెలకు రూ.1500 (19 సం॥ నుంచి 59 సం ॥ వరకు)
- ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

సూపర్ సిక్స్ హామీల అమలుపై నోరు మెదపని ప్రభుత్వం

మత్స్యకార భరోసాను అటకెక్కించినట్లేనా..?



ప్రతి మహిళకు నెలకు రూ.1,500

నరసాపురం	56,320 (అర్హులు)
పాలకొల్లు	73,753 (అర్హులు)
ఆచంట	85,480 (అర్హులు)

జగన్ పాలనలో ఒక్కో ఏడాది రైతులకు అందిన సాయం

నరసాపురం	రూ.77.99 కోట్లు
పాలకొల్లు	రూ.81.40 కోట్లు
ఆచంట	రూ.141.11 కోట్లు



టీడీపీ పాలనలో ఒక్కో ఏడాది రైతులకు అందాల్సిన సాయం


నరసాపురం	రూ.115.54 కోట్లు
పాలకొల్లు	రూ.136.9 కోట్లు
ఆచంట	రూ.254.6 కోట్లు

జగన్ పాలనలో ఒక్కో ఏడాది తల్లులకు అందిన సాయం

నరసాపురం	రూ.81.351 కోట్లు
పాలకొల్లు	రూ.40.63 కోట్లు
ఆచంట	రూ.98.06 కోట్లు

టీడీపీ పాలనలో ఒక్కో ఏడాది తల్లులకు అందాల్సిన సాయం

నరసాపురం	రూ.165.50 కోట్లు
పాలకొల్లు	రూ.137.40 కోట్లు
ఆచంట	రూ.348.80 కోట్లు



యువతకు నెలకు 3 వేల రూపాయల నిరుద్యోగ భృతి

నరసాపురం	50,120 (అర్హులు)
పాలకొల్లు	34,790 (అర్హులు)
ఆచంట	29,000 (అర్హులు)

'తల్లికి వందనం' ఎప్పుడిస్తారో?



తల్లికి వందనం పథకం ద్వారా ఇంటిలో ఎంతమంది ఉంటే అంతమంది పిల్లలకు రూ. 15 వేలు చొప్పున ఇస్తామని అన్నారు. పిల్లలకు స్కూలు ఫీజులు చెల్లించడానికి ఈ సొమ్ము ఆసరాగా ఉంటుందని ఆనందించాం. జగనన్న ప్రభుత్వంలో అమ్మఒడి కింద జూన్ నెలలో తల్లి బ్యాంక్ అకౌంట్లలో నేరుగా ఈ సొమ్ము జమ చేయడంతో ఫీజులు చెల్లించడానికి ధైర్యంగా ఉండేది. కూటమి ప్రభుత్వంలో పథకం అమలు చేస్తే మాకు ఆసరాగా ఉంటుంది. – వెన్నెల సుజాత, వైపీ గరువు

ఇచ్చిన హామీనే అడుగుతున్నాం



అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకంలో భాగంగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి నెలకు రూ. 1500 ఇస్తామని కూటమి నేతలు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చి నేటికి రెండు నెలలు కావస్తున్నా ప్రభుత్వ పెద్దలు ఆడబిడ్డ నిధి అమలు ఊసే ఎత్తడం లేదు. ఇచ్చినా హామీనే అడుతున్నాం.. ఆడబిడ్డ నిధి ఎప్పుడు నుంచి ఇస్తారో తక్షణం ప్రకటించాలి.

– ఆర్.దీప్తి, పాలకొల్లు

క్లుప్తంగా

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

నరసాపురం రూరల్: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే శిక్షార్హులవుతారని తహసీల్దార్ రాజరాజేశ్వరి అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ ఆదేశాల మేరకు రూరల్ సీఐ జి.దుర్గా ప్రసాద్‌తో కలసి ఆమె ఎల్బీచర్ల గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఇటీవల ఎల్బీచర్లలో వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా రెండు సామాజిక వర్గాల మధ్య ఒక సినిమా పాట విషయంలో తలెత్తిన వివాదాలతో రాళ్ల దాడి చేసుకున్న ఘటనపై చర్చించారు. ఇరు వర్గాలపై కేసులు నమోదయ్యాయని, ఘటన జరిగిన నాటినుంచీ గ్రామంలో పోలీసు పికెటింగ్ కొనసాగుతోందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి దాడులకు పాల్పడితే సహించేది లేదని తహసీల్దార్, రూరల్ సీఐలు హెచ్చరించారు. సమావేశంలో ఆర్ఐ యశోధ, వీఆర్వో వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

వైద్య విద్యకు దూరం చేయొద్దు

పాలకొల్లు అర్బన్: పేద, మధ్య తరగతి విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే దిశగా సీఎం చంద్రబాబు ప్రవర్తిస్తున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్యదర్శి దేవ రాజేష్‌కుమార్ విమర్శించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వైఎస్సార్ సీపీ హయాంలో మంజూరై నిర్మాణంలో ఉన్న 17 వైద్య కళాశాల పనులను నిలుపుదల చేస్తూ సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. వైద్య కళాశాలలను ప్రైవేటు యాజమాన్యానికి అప్పగించే దిశగా చంద్రబాబు ఆలోచన చేయడం వల్ల పేద, మధ్య తరగతి వర్గాలు పిల్లలు వైద్య విద్యను అభ్యసించలేరని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర మెడికల్ బోర్డు రాష్ట్రంలోని కొన్ని కళాశాలలకు అదనపు సీట్లు కేటాయించినప్పటికీ వాటిని కూడా తిరస్కరించడం సరికాదని తెలిపారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విద్య, వైద్యానికి ఎంతో ప్రాధాన్యత ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు.

జిల్లా స్థాయి పోటీలు

నరసాపురం: గాంధీ జయంతిని పురస్కరించుకుని వైఎన్ కళాశాల గాంధీ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 23, 24 తేదీల్లో వివిధ అంశాల్లో స్కూల్, కళాశాల విద్యార్థులకు జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు, గాంధీ అధ్యయన కేంద్రం డైరెక్టర్ పులపర్తి సుబ్బారావు తెలిపారు. 23న వైఎన్ కళాశాలలో స్కూల్ విద్యార్థులకు మధ్యాహ్నం ఒంటి గంటకు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణ, మధ్యాహ్నం 2 గంటలకు దేశభక్తి పాటల పోటీలు, మధ్యాహ్నం 3 గంటలకు గ్రామ స్వరాజ్యం అనే అంశంపై డ్రాయింగ్ పోటీలు ఉంటాయని వివరించారు. 24న కళాశాల విద్యార్థులకు మధ్యాహ్నం ఒంటి గంటకు స్త్రీ సాధికారతపై గాంధీజీ ఐడియాలజీ అనే అంశంపై వక్తృత్వం, రెండు గంటలకు శాంతి, అహింస అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

పోషకాహారంతో మెరుగైన సమాజం



యలమంచిలి : కాంభొట్లపాలెంలో పౌష్టికాహార మాసోత్సవంలో పాల్గొన్న మహిళలు



పాలకొల్లు : కాపవరంలో పోషకాహార విలువలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

యలమంచిలి: మెరుగైన సమాజ నిర్మాణానికి పోషకాహారం ముఖ్యమని ఐసీడీఎస్ అసిస్టెంట్ సీడీపీఓ పి.నాగరత్నం అన్నారు. కాంభొట్లపాలెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరత్నం గర్భిణులు, బాలింతలు, మహిళలకు పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందించే పోషకాహారం గురించి వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు వివిధ రకాలు పౌష్టికాహార స్టాల్స్‌ను ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అనిశెట్టి మల్లిక, అంగన్‌వాడీ కార్యకర్తలు కడలి యమున, మట్టా ధనలక్ష్మి, వి శ్రావణి దుర్గ, పల్లి పద్మ, వై శ్రీదేవి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, మహిళా పోలీస్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు మండలం కాపవరం గ్రామ సచివాలయ ఆవరణలో బుధవారం పోషకాహార మాసోత్సవాల సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ ఇందిర ఆదేశాల మేరకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సర్పంచ్ కోలాటి రాధ మాట్లాడుతూ యువతుల పట్ల అసభ్యకరంగా లేదా లైంగికంగా ఎవరైనా ప్రవర్తిస్తే సంబంధిత సమాచారాన్ని అంగన్‌వాడీ లేదా ఆరోగ్య సిబ్బంది ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పులఖండం సత్యవేణి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని భుజించాలన్నారు. గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, అంగన్‌వాడీ టీచర్లు పద్మావతి, మసేనమ్మ, లలిత కుమారి, ఏఎన్ఎం సుజ్ఞానమణి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



పెనుగొండ : ఆచంటలో పౌష్టికాహారంతో ముగ్గువేసిన అంగన్‌వాడీలు

బీఆర్ఎంవీ మునిసిపల్ హైస్కూల్‌లో...

ఆడపిల్లలను ఎదగనిద్దాం.. ఆడపిల్లలను చదవనిద్దాం కార్యక్రమం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ హెనా మాట్లాడుతూ కుటుంబంలో ఆడపిల్ల చదుకువుంటే ఆ కుటుంబం ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందుతుందని వివరించారు. పాఠశాల హెచ్ఎం ఝాన్సీలక్ష్మి, పీహెచ్ఎన్ ఎలిజబెత్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పులఖండం సత్య వేణి, అంగన్‌వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.


పౌష్టికాహారంతో ఆరోగ్యవంతమైన బిడ్డ

పెనుగొండ: గర్భిణులు సమతుల్యమైన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వవచ్చునని ఆచంట సర్పంచ్ కోట సరోజినీ వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం ఆచంట పంచాయతీ వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజరు శ్యామలాంబ, పంచాయతీ కార్యదర్శి జి.నరసింహరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు వైట్ల ఉషారాణి, గుత్తుల శ్రీదేవి సత్యవతి, మంగలక్ష్మీలు పాల్గొన్నారు.


పెనుగొండలో..

జిలం చెరువు అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం మాసోత్సవం నిర్వహించారు. సూపర్ వైజర్ ఎం విజయకుమారి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే బాలామృతం, ఇతరవాటితో రెసిపీ తయారుచేసే విధానం వివరించారు. సీహెచ్‌ఓ దానమ్మ, సీహెచ్ భానుతేజస్వి, పి.సరస్వతి, కె.తులసీ, కె.ఉషశ్రీ, కె.దుర్గ, పి.దేవి, కుమారి, కె.సత్య నారాయణలు పాల్గొన్నారు.

పరిశుభ్రత అందరి బాధ్యత



నరసాపురం : బస్టాండ్ వద్ద పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం



మొగల్తూరు : ర్యాలీలో పాల్గొన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు

నరసాపురం: పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని వైఎన్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ కనకారావు అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బస్టాండ్‌లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కనకారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛతా హీ కార్యక్రమంలో భాగంగా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు దేశవ్యాప్తంగా 500 కళాశాలలను ఎంపిక చేయగా, వాటిలో ఒకటి వైఎన్ కళాశాల ఉండటం గమనార్హమన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ఖచ్చితంగా పాటించాలని చెప్పారు. పరిశుభ్రత, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు సీహెచ్ సోమేశ్వరరావు, ఎస్ యాకోబ్, కళాశాల సామాజిక సేవా విభాగం కన్వీనర్ బీఎస్ఎస్‌వీ ప్రసాద్, అసిస్టెంట్ డిపో మేనేజర్ టి.విజయదుర్గ పాల్గొన్నారు.

స్వచ్ఛతతో గ్రామాలభివృద్ధి

పెనుగొండ: స్వచ్ఛతా హీ సేవతో గ్రామాలు అభివద్ధి చెందుతాయని వడలి సర్పంచ్ కాసాని విజయలక్ష్మీ పెద్దిరాజు అన్నారు. బుధవారం వడలిలో రెండో రోజు పంచాయతీ పరిధిలో విద్యార్థులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛ భారత్‌పై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వలపన నరేష్, పంచాయతీ సభ్యులు మేకా శివయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం

మొగల్తూరు: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈవోపీఆర్డీ నవీన్ కిరణ్ సూచించారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాల్లో భాగంగా రెండో రోజు బుధవారం స్థానిక నెంబర్1 పాఠశాల ప్రాంతంలో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల సమీపంలోని పలు ప్రాంతాల్లో చేపట్టిన పరిశుభ్రతా కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు మొగల్తూరు ఆసుపత్రి సిబ్బందిచే ప్రథమ చికిత్స నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు సుబ్బారావు, శ్రీనివాస్, గంగన్న, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత క్యాంపెయిన్

పాలకొల్లు సెంట్రల్: భారతదేశాన్ని స్వచ్ఛమైన, అభివృద్ధి చెందిన దేశంగా ఉండేలా ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా వ్యవహరించాలని కళాశాల ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి అన్నారు. బుధవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛత క్యాంపెయిన్‌లో భాగంగా ఏక్ పెడ్ మా కి నామ్ ప్లాంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. విద్యార్థులు తీసుకువచ్చిన వివిధ రకాల పండ్లు, పూల మొక్కలను కళాశాల ప్రాంగణంలో నాటారు. స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. వైస్ ప్రిన్సిపాల్ టి కృష్ణ, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆఫీసర్ డా ఎం రామకృష్ణ, విడివి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అమ్మ పేరిట మొక్క

స్థానిక దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ ఆదేశాల మేరకు ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా అమ్మ పేరిట మొక్క కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఆవరణలో వివిద రకాల పండ్లు మొక్కలు నాటారు. కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి, వైస్ ప్రిన్సిపాల్ రవి శంకర్, పీవో నోబుల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం

మొగల్తూరు: విజయవాడ వరద బాధితులకు విద్యార్థులు తమ వంతు సాయం అందించారు. మొగల్తూరులోని ప్రతిభ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు సేకరించిన రూ.1,82,700లను బుధవారం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌కు అందించారు. స్కూల్ ప్రిన్సిపాల్ ఎం సుస్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

పెనుగొండ: వరద బాధితులకు అందించేందుకు కరుగోరుమిల్లి గ్రామస్తులు రూ.లక్షా1116 చెక్కును ఎమ్మెల్యే పితాని సత్యనారాయణకు తహసీల్దారు సుగణ సంధ్య చేతుల మీదుగా బుధవారం చెక్కును అందించారు. సర్పంచ్ అల్లం పద్మావతి, అల్లం సూర్యప్రకాష్, ఉంగరాల లక్ష్మణరావు, సలాది మురళీ కృష్ణ, ఉంగరాల గణేష్, ముత్యాల ఏడుకొండలు, నాగరాజు, బాసిరాజులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా చండీహోమం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా చండీహోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. బుధవారం ఆలయ ప్రాకార మండపంలో నిర్వహించిన చండీహోమంలో 18 మంది దంపతులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

ఆలయ పరిశుభ్రం

క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో పారిశుద్ధ్యోత్సవాల్లో భాగంగా ఆలయాన్ని శుభ్రం చేశారు. ఆలయ ప్రాకార మండపం బేడా మండపం పైన, ఆలయ ప్రాంగణంలో సిబ్బంది శుభ్రం చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ మెండెం స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు అండగా నిలవాలి

పెనుగొండ: రైతులకు మద్దతు ధర అందేవిధంగా అధికారులుఅ ండగా నిలవాలని తహసీల్దార్ జి.అనితకుమారి అన్నారు. బుధవారం పెనుగొండ రైతు సేవా కేంద్రంలో ఖరీఫ్ సీజన్ 2024–25 రైతు సేవా కేంద్రాలు ద్వారా ధాన్యం కొనుగోలుపై నిర్వహించిన శిక్షణలో ఆమె మాట్లాడారు. రైతు సేవా కేంద్రాలు ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా పనిచేస్తాయన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు సమక్షంలో ఈ కేంద్రాలు నిర్వహిస్తామని తెలిపారు. కనీస మద్దతు ధర రైతులకు అందించడమే ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో మండల ప్రొక్యూర్మెంట్ సభ్యులు, మండల వ్యవసాయాధికారి పి స్పందన, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 16 మంది ఎంపిక

పాలకొల్లు సెంట్రల్: బుధవారం స్థానిక చాంబర్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కళాశాలలో ఐసాన్, ఇంజి, డీఎస్సీ, ఇండో ఎంఐఎం, హుందాయ్‌మోబీస్, రిప్యుటేటెడ్ ఫార్మా కంపెనీలు నిర్వహించిన ఈ మేళాలో 68 మంది అభ్యర్థులు పాల్గొనగా 16 మంది ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన ఒక్కో అభ్యర్థికి రూ.18 వేలు వేతనం వస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కేవీఆర్ నరసింహారావు, సెక్రటరీ కె.రామరాజు, ప్లేస్మెంట్ ఇన్‌చార్జి యు.జానకి రామయ్య, టి.మీనా తదితరులు పాల్గొన్నారు.